క్లుప్తంగా

అనంత పద్మనాభ స్వామి దీపోత్సవానికి రూ.8 లక్షలు

సింహాచలం: పద్మనాభంలోని అనంతపద్మనాభ స్వామి దేవస్థానంలో వచ్చేనెలలో జరిగే దీపోత్సవం నిర్వహణకు భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చొరవతో సింహాచలం దేవస్థానం రూ. 8 లక్షలు కేటాయించింది. దీపోత్సవం నిర్వహణకు నిధులు కేటాయించాలని సింహాచలం దేవస్థానం అధికారులకు ఇటీవల ముత్తంశెట్టి విజ్ఞప్తి చేశారు. దీంతో అనంతపద్మనాభస్వామి దేవస్థానం ఈవో దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ ద్వారా సింహాచలం దేవస్థానం ఈవోకు ప్రతిపాదనలు పంపారు. ఈ మేరకు సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్‌కు ఆ ప్రతిపాదనని పంపారు. ఆ ప్రతిపాదనకు కమిషనర్ ఆమోద ముద్ర వేశారు.

క్లీనింగ్ యంత్రాలతో పరిశుభ్రంగా తీరం



సాగర్‌నగర్ బీచ్‌లో జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, తదితరులు

కొమ్మాది: బీచ్ క్లీనింగ్ యంత్రాలతో విశాఖ సముద్ర తీర ప్రాంతాన్ని మరింత పరిశుభ్రంగా ఉంచాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా సాగర్‌నగర్, రుషికొండ, భీమిలి బీచ్‌లో బీచ్ క్లీనింగ్ మిషన్ సరఫరా చేసే ఫామ్ టెక్ ప్రతినిధులతో కలిసి పర్యటించారు. యంత్రాల పనితీరు, పని వేళలను ఫామ్‌టెక్ ప్రతినిధులు, అధికారులను అడిగి తెలుసుకున్నారు. సాగర్‌నగర్ సమీపంలో బీచ్‌లోకి కాలువల ద్వారా చేరే మురుగు నీరును అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని, సాగర్‌నగర్ కోకో హెరీనా – 7 వద్ద కంటైనర్ టాయిలెట్లు వినియోగంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్లు బొడ్డేపల్లి రాము, కనక మహాలక్ష్మి పాల్గొన్నారు.

హిందీ పరీక్షల ఫీజు చెల్లింపునకు గడువు 15

తగరపువలస: దక్షిణ భారత హిందీ ప్రచారసభ – చెన్నై ద్వారా నిర్వహించే పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు అపరాధ రుసుం లేకుండా డిసెంబరు 15 వరకు ఫీజు చెల్లించవచ్చని భీమిలి ఆదర్శహిందీ ప్రేమీ మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు తెలిపారు. 2024 ఫిబ్రవరి రెండో శనివారం, ఆదివారం పరిచయ్, ప్రాథమిక, మాధ్యమిక, రాష్ట్ర భాష, ప్రవేశిక, రాష్ట్ర భాష విశారద పూర్వార్థ, రాష్ట్ర భాష విశారద ఉత్తరార్థ, రాష్ట్ర భాష ప్రవీణ పూర్వార్థ, రాష్ట్ర భాష ప్రవీణ ఉత్తరార్థ పరీక్షలు నిర్వహించనున్నారన్నారు. మిగిలిన వివరాలు, ఉచిత శిక్షణకు 89856 47419, 89858 97419లో సంప్రదించాలని కోరారు.

భూసార పరీక్షలే నేలకు శ్రీరామ రక్ష

పద్మనాభం: భూసార పరీక్షలే నేలకు శ్రీరామ రక్ష అని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె.అప్పలస్వామి అన్నారు. మండలంలోని అనంతవరంలో శుక్రవారం భూసార పరీక్షల ఆవశ్యకతపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే 500 మట్టి నమూనాలను ప్రయోగశాలకు పంపించామన్నారు. త్వరలో వీటి ప్రయోగ ఫలితాలు రైతులకు తెలియజేస్తామన్నారు. రైతులతా తమ భూములకు భూసార పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో భీమునిపట్నం సబ్ డివిజన్ వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ విజయప్రసాద్, ఆశాదేవి పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎస్‌ఐలు



సురేష్ కుమార్



ఎస్‌ఐ సురేష్

పీఎం పాలెం: స్థానిక పోలీస్ స్టేషన్ నూతన లా అండ్ ఆర్డర్ ఎస్‌ఐగా కె.సురేష్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు ఆయన ఎంవీపీ పోలీస్ స్టేషన్ నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐ వెంకటరావు పదోన్నతిపై పీఎం పాలెం ట్రాఫిక్ సీఐగా బదిలీ అయ్యారు.

పద్మనాభం: పద్మనాభం పోలీస్ స్టేషన్ ఎస్‌ఐగా జె.సురేష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. పెందుర్తి పోలీస్ స్టేషన్ నుంచి ఆయన ఇక్కడకు బదిలీపై వచ్చారు.



అన్నదాతలకు జగనన్న భరోసా

- రైతు భరోసా కేంద్రాలతో విస్తృత సేవలు
- విత్తనాల నుంచి పంట కొనుగోలు వరకూ ఏర్పాట్లు
- వ్యవసాయాన్ని పండగ చేసిన సీఎం జగన్ మోహన్ రెడ్డి

విత్తనాలు కావాలంటే... ఆధార్ కార్డు తీసుకెళ్తే క్షణాల్లో ఆర్‌బీకేలో అందజేస్తున్నారు... ఎరువులు కావాలంటే... నమోదు చేసుకున్న వెంటనే సరఫరా చేస్తున్నారు... పండించిన పంట అమ్ముకోవాలంటే... ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతుల ఖాతాల్లో నేరుగా నగదు జమ చేస్తోంది... ఇదీ జగనన్న సంక్షేమ రాజ్యంలో ప్రస్తుత పరిస్థితి. చంద్రబాబు పాలనలో ఖరీఫ్, రబీ... సీజన్ ఏదైనా రైతుల అవస్థలు అన్నీ ఇన్నీ కావు. రెక్కలు ముక్కలు చేసుకొని ఆరుగాలం కష్టించి పంటలు పండించే అన్నదాతల సంక్షేమాన్ని టీడీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. విత్తనాలు, ఎరువులు కావాలంటే రోజుల తరబడి ప్రైవేటు వ్యాపారుల వద్ద క్యూలో నిరీక్షించాల్సిన దుర్భర పరిస్థితి. అందులోనూ కల్తీల బెడద తప్పేదికాదు. పండించిన పంట అమ్ముకుందామంటే గెద్దల్లా దళారులు వాలిపోయేవారు. చేతికొచ్చిన పంట నష్టపోతే కనీసం పరిహారం కూడా పొందలేని దైన్యస్థితి. ఫలితంగా దేశానికి వెన్నుముఖగా నిలిచే రైతన్న నడ్డి విరిగిపోయి వ్యవసాయమంటేనే ఆమడ దూరం వెళ్లిపోయే పరిస్థితులు రాష్ట్రంలో నెలకొన్నాయి. ఈ దశలో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు సంక్షేమమే ధ్యేయంగా రైతు భరోసా కేంద్రాలను (ఆర్‌బీకే) నెలకొల్పి వాటి ద్వారా విత్తు నుంచి పంట చేతికొచ్చే వరకు అన్ని సేవలు స్థానికంగా అందేలా చర్యలు తీసుకున్నారు. చంద్రబాబు దండగ అన్న వ్యవసాయాన్ని సీఎం జగన్ పండగలా మార్చారు. పెట్టుబడి సాయం కింద రైతు భరోసా, సీజన్‌కు ముందే రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలు, ఎరువుల సరఫరా, ఈ – క్రాప్ నమోదు ద్వారా పంట నష్టపరిహారం అందజేత, ప్రైవేట్ వ్యాపారుల దోపిడీని అరికట్టడానికి ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు, వైఎస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా రాయితీతో ట్రాక్టర్లు, వరికోత యంత్రాలు, కలుపుతీత యంత్రాలు, దమ్ము సెట్లు అందజేశారు. కల్తీ విత్తనాలు నిరోధం వంటి సంస్కరణలు చేపట్టి రైతులకు వెన్నుదన్నుగా నిలిచారు. ఫలితంగా రైతుల జీవితాల్లో కొత్త వెలుగులు నిండుకున్నాయి.

– ఆనందపురం

47 నియోజకవర్గంలో రైతు భరోసా కేంద్రాలు

రూ.2.36 కోట్లతో భీమిలి మండలంలో 11 రైతు భరోసా కేంద్రాలు నిర్మించారు

రూ.3.87 కోట్లతో ఆనందపురం మండలంలో 18 రైతు భరోసా కేంద్రాలు నిర్మించారు.

రూ.3.44 కోట్లతో పద్మనాభం మండలంలో 16 రైతు భరోసా కేంద్రాలు నిర్మించారు.

రూ.132.03 కోట్లు డివిజన్‌లోని భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల్లోని 23,529 మంది రైతులకు రైతు భరోసా సాయం



వేములవలసలో రైతు భరోసా కేంద్రం



ఆనందపురం మండలం బోని ఆర్బీకేలో కియోస్క్ యంత్రం ద్వారా రైతులకు సూచనలిస్తున్న అధికారి

రైతన్నలకు రాయితీతో అండ

భీమిలి డివిజన్‌లోని ఆనందపురం, పద్మనాభం, భీమిలి మండలాల రైతులకు 47 ఆర్‌బీకేల ద్వారా ఐదేళ్లలో 13,560 క్వింటాళ్ల విత్తనాలు సరఫరా చేశారు. రూ.1.01 కోట్ల విత్తన రాయితీ అందించారు. 4321 మెట్రిక్ టన్నుల ఎరువులు రాయితీతో సరఫరా చేశారు. వైఎస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా భీమిలి డివిజన్‌లో యంత్రాలు కొనుగోలుకు రూ.1.21 కోట్ల రాయితీ ఇచ్చారు. భీమిలి మండలంలో 13 గ్రూపులకు రూ.39.32 లక్షలు, ఆనందపురం మండలంలో 14 గ్రూపులకు రూ.37.25 లక్షలు, పద్మనాభం మండలంలో 13 గ్రూపులకు రూ.45 లక్షల రాయితీ అందించారు.



దాకమర్రి ఆర్‌బీకే ద్వారా రాయితీపై యంత్ర పరికరం పొందిన రైతులు



మజ్జివలస ఆర్‌బీకే నుంచి ఎరువులు తీసుకెళ్తున్న రైతులు

కల్తీ విత్తనాల బెడద తప్పింది



సచివాలయాలో రైతు భరోసా కేంద్రం ఏర్పాటు వల్ల కల్తీ విత్తనాలు, ఎరువుల బెడద తప్పింది. గతంలో దూర ప్రాంతాలకు వెళ్లి ప్రైవేటు వ్యాపారుల వద్ద అధిక ధరలు చెల్లించి కొనుగోలు చేసినా కల్తీ విత్తనాలు, ఎరువులు అంటగట్టేవారు. దీనివల్ల పంటలకు చీడపీడలు ఆశించి తీవ్రంగా నష్టపోయేవారిమి. ప్రస్తుతం ఆర్‌బీకేల ద్వారా విత్తనాలకు మొలక కట్టి పరిశీలించి సరఫరా చేస్తున్నారు. దీనివల్ల నాణ్యమైన పంట చేతికొస్తోంది. ఆర్‌బీకేలతో ఎంతో ప్రయోజనం పొందుతున్నాం.

– కనకల శ్రీను, బోని రైతు.

ధాన్యానికి గిట్టుబాటు ధర

రైతు భరోసా కేంద్రంలోనే ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడం వల్ల గిట్టుబాటు ధర లభిస్తోంది. గతంలో ప్రైవేటు వ్యాపారులకు విక్రయించుకోవాల్సి రావడంతో తక్కువ ధరకే అమ్ముకునేవారిమి. ప్రకృతి వైపరీత్యాలు సంభవించి ధాన్యం తడిస్తే ఎవరూ కొనేవారు కాదు. కానీ నేడు ధాన్యం తడిచినా తేమ శాతం ఆధారంగా ప్రభుత్వం ధాన్యాన్ని కొనుగోలు చేసి డబ్బులు బ్యాంక్ ఖాతాల్లో నేరుగా జమచేస్తోంది. దీంతో ధైర్యంగా వరి పంటను సాగు చేస్తున్నాం.



– ఎర్నింటి అప్పలనాయుడు, బోని రైతు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పనులు ప్రారంభించండి

ఆనందపురం : అంగన్‌వాడీ కేంద్రాల్లో సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం నిధులు విడుదల చేసిన దృష్ట్యా పనులు వెంటనే ప్రారంభించాలని డీఈవో చంద్రకళ ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో శుక్రవారం ఆనందపురం, పద్మనాభం, భీమిలి మండలాల అంగన్‌వాడీ కేంద్రాల సూపర్‌వైజర్లు, కార్యకర్తలు, హెచ్‌ఎంలు, సూపర్‌వైజర్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం, రంగులు వేయడం వంటి పనులు చేయాల్సి ఉంటుందన్నారు. ఏసీడీపీవో ఎల్.సుజాత మాట్లాడుతూ కేంద్రాల పరిధిలో త్వరితగతిన కమిటీలు ఏర్పాటు చేసి బ్యాంక్ ఖాతాలు తెరిచి పనులు ప్రారంభించాలని సూచించారు. కార్యక్రమంలో సర్వశిక్ష అభియాన్ ఏపీసీ శ్రీనివాస్, ఈఈ నరిసింహరావు, ఐసీడీఎస్ పీవోలు ఎం.శ్రీదేవి, వెంకటేశ్వరి, సూపర్‌వైజర్లు ఉమా జానకి, పీవీవీ రత్నం, రేఖావాణి, సరిత, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సుజాత

వైఎస్సార్‌సీపీ నాయకుల ఇంటింటా ప్రచారం



శింగనబందలో ప్రచారం చేస్తున్న ప్రజాప్రతినిధులు



పిలకవానిపాలెంలో జెండా ఎగురవేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తగరపువలస: 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమంలో భాగంగా భీమిలి మండలం శింగనబంద పంచాయతీలో వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు శుక్రవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. పంచాయతీలో ఈ అయిదేళ్లలో జరిగిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. పార్టీ మండల అధ్యక్షుడు గాడు శ్రీను, జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, ఎంపీపీ దంతులూరి వాసురాజు, సర్పంచ్ గాడు వెంకట నారాయణ, ఎంపీటీసీ సభ్యుడు చెల్లూరి నగేష్‌బాబు, పొట్నూరు చంద్రశేఖర్, పల్లా సన్యాసిరావు, గుడ్డాల ఎల్లయ్య, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

మధురవాడ: 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం జీవీఎంసీ 7వ వార్డులోని పిలకవానిపాలెంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ పతాకాన్ని పార్టీ వార్డు అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు..

రాష్ట్రంలో అవినీతి రహిత పాలన

పద్మనాభం: సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాష్ట్రంలో అవినీతి రహిత పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని వెంకటాపురంలో శుక్రవారం రాత్రి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే సీఎం వైఎస్ జగన్ మోహన రెడ్డినే మరలా ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. విశాఖపట్నం పరిపాలన రాజధాని కావడం వల్ల భూముల విలువ పెరుగుతుందన్నారు. ఎవరూ భూములు అమ్ముకోవద్దన్నారు. రేవిడి సచివాలయం పరిధిలో సంక్షేమ పథకాల రూపంలో రూ.18 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. అనంతరం రూ.97 లక్షల జల జీవన్ మిషన్ నిధులతో ఇంటింటికీ కుళాయిల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఆవిష్కరించారు. పద్మనాభంలో సంక్షేమ పథకాల ఫ్లెక్సీని జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో పద్మనాభం సర్పంచ్ తాలాడ పాప, రేవిడి ఎంపీటీసీ సభ్యుడు సీర సూరప్పడు, వైఎస్సార్ సీపీ నాయకులు మరగడ అప్పారావు, తాలాడ పద్మనాభం, కోన రమణ పాల్గొన్నారు.



కుళాయిల నిర్మాణానికి శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

విస్తృతంగా అన్నదానాలు

తగరపువలస: చిట్టివలస జ్యూట్‌మిల్లు రామాలయంలో కార్తీకమాసం సందర్భంగా శుక్రవారం ఆలయ అర్చకుడు ఆకెళ్ల రవిగణేష్ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. మేకల శ్రీను, మల్లిబాబు, పిల్లా రాజేష్ పాల్గొన్నారు.

పద్మనాభం: మద్ది గ్రామంలోని శ్రీ ధర్మ శాస్త్ర పీఠం వద్ద భీమునిపట్నం ఎంపీపీ దంతులూరి వాసురాజు ఆర్థిక సహకారంతో శుక్రవారం అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పద్మనాభం ఎంపీపీ కె.రాంబాబు, వైఎస్సార్ సీపీ భీమిలి మండల అధ్యక్షుడు గాడు శ్రీను, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



మద్దిలో అన్నదానం చేస్తున్న ఎంపీపీలు వాసురాజు, రాంబాబు, తదితరులు

సీఎం జగన్ పాలనలో అర్హులందరికీ పథకాలు

- మోసగాళ్లు, యాక్టర్లను నమ్మొద్దు
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



సేవానగర్‌లో సంక్షేమ పథకాల ఫ్లెక్సీ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు



వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

కొమ్మాది: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మేకప్ వేసుకుని యాక్టర్లు, వెన్నుపోటు పొడిచే మోసగాళ్లు ఓట్ల కోసం మీ ముందుకు వస్తారని, వారి మాటలు నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కోరారు. జీవీఎంసీ 5, 6 వార్డుల్లో గల కొమ్మాది సేవానగర్, బోరవానిపాలెం సచివాలయం వద్ద 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ముందుగా వైఎస్సార్ సీపీ జెండా, సంక్షేమ పథకాల పట్టిక ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మంచి చేసే నాయకుడు కావాలో, మోసం చేసే నాయకులు కావాలో ప్రజలే నిర్ణయించుకోవాలన్నారు. ఎన్నికల వేళ ఇచ్చిన హామీలు వంద శాతం అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఒకవైపు అభివృద్ధి చేస్తూ, మరోవైపు అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించేలా పాలిస్తున్నారని కొనియాడారు. రానున్న ఎన్నికల్లో మరలా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు. కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ 5, 6 వార్డుల అధ్యక్షులు పోతిన హనుమంతు, బొట్టా అప్పలరాజు, నాయకులు గాదె రోశిరెడ్డి, జేఎస్ రెడ్డి, గుంటుబోయిన సంజీవ్‌యాదవ్, ముచ్చు రామారావు, బోయి సూరిరెడ్డి, పోతిన సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

మహిళా పక్షపాతి సీఎం జగన్

ఆనందపురం : సమాజంలో మహిళలకు సముచిత స్థానం కల్పించి, వారు అన్ని రంగాల్లో రాణించేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం ఆనందపురంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు జరుపుతున్న సంక్షేమ పథకాల్లో 90 శాతం మహిళల పేరునే ఉన్నాయన్నారు. అలాగే స్థానిక సంస్థల పదవుల్లో, నామినేటెడ్ పోస్టుల్లో 50 శాతం మహిళలకే కేటాయించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఆనందపురం మండలంలో కోట్లాది రూపాయలు విలువ చేసే ఇళ్ల స్థలాలను మహిళలకే అందజేశామన్నారు. నాలుగున్నరేళ్ల పాలనలో అవినీతికి అడ్డకట్ట పడిందన్నారు. ఆనందపురం పంచాయతీలో రూ.34 కోట్లతో సంక్షేమం, అభివృద్ధి పనులు చేపట్టామని వివరించారు. సర్పంచ్ చందక లక్ష్మి, పార్టీ మండల అధ్యక్షుడు బంక సత్యం, వైస్ ఎంపీపీ పాండ్రంకి శ్రీను, చందక అప్పలస్వామి, చందక సూరిబాబు, షిణగం రామారావు, షిణగం చిన్న రామారావు, సహకార సంఘం అధ్యక్షుడు పాండ్రంకి అప్పారావు, రౌతు వెంకటరావు, బొట్టా రామకృష్ణ, చందక అప్పలనాయుడు, బంక కృష్ణంనాయుడు, కోరాడ అప్పలస్వామి నాయుడు, లెంక రాంబాబు, రౌతు శ్రీను, పడాల రాము పాల్గొన్నారు.

హామీల అమలే ధ్యేయంగా పాలన

పీఎం పాలెం: ఇచ్చిన హామీలు అమలు చేయడంలో గత పాలకులతో సీఎం జగన్‌కు పోలిక లేదని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం జీవీఎంసీ 8వ వార్డు బింద్రానగర్ ధర్మపురి కాలనీలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి హామీల అమలే ధ్యేయంగా సీఎం జగన్ పాలన సాగించారని కొనియాడారు. 2014లో చంద్రబాబు ఇచ్చిన హామీలు, అమలు చేసిన తీరు... 2019లో జగన్ ఇచ్చిన హామీలు, అమలు చేసిన తీరు బేరీజు వేసుకోవాలని సూచించారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే సీఎం జగన్‌నే మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ లొడగల అప్పారావు, సింహాచలం దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యురాలు రాజేశ్వరి, పోలిరెడ్డి, పిళ్లా కృష్ణమూర్తి పాత్రుడు, సూరిబాబు, గోపి, మురళీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పెద్దిపాలెంలో అగ్ని ప్రమాదం

ఆనందపురం : మండలంలోని పెద్దిపాలెంలో శుక్రవారం సంభవించిన అగ్నిప్రమాదంలో ఇల్లు, పాన్‌షాపు, సెలూన్ దగ్ధమయ్యాయి. ఈ సంఘటనలో సుమారు రూ.2 లక్షల ఆస్తి నష్టం సంభవించినట్టు అంచనా వేశారు. తాటిపూడి గోవింద్ పెద్దిపాలెంలో కుటుంబంతో కమ్మల ఇంట్లో నివసిస్తున్నాడు. జీవనోపాధికోసం ఆ పక్కనే సెలూన్, పాన్‌షాపు నిర్వహిస్తున్నాడు. ఇదిలా ఉండగా శుక్రవారం ఉదయం ముందు పాన్‌షాపులో మంటలు చెలరేగి పక్కనే ఉన్న కమ్మల ఇల్లు, సెలూన్‌కు కూడా అంటుకున్నాయి. దీంతో అన్నీ పూర్తిగా కాలిపోయాయి. ప్రమాదంలో రూ.35 వేలు నగదుతోపాటు, ఇల్లు, పాన్‌షాపు, సెలూన్‌లో గల వస్తువులు కాలి బూడిదయ్యాయి. దీంతో బాధితులు కట్టుబట్టలతో రోడ్డున పడ్డారు. సంఘటన స్థలాన్ని తహసీల్దార్ లోకవరపు రామారావు సందర్శించి ప్రమాద వివరాలు అడిగి తెలుసుకొని నష్టాన్ని అంచనా వేశారు. బాధితులకు ప్రభుత్వం తరపున బియ్యం అందజేశారు. నాయకులు బావిశెట్టి రాజు, మరుపిళ్ల చిన్నయ్యపాత్రుడు పరామర్శించారు. గుడిలోవ ఛానల్ నీటి సంఘం మాజీ అధ్యక్షుడు కూరాకుల వెంకటేష్ బాధితులకు రూ.2వేలు నగదు, చీరలు, దుప్పట్లు, తువ్వాళ్లు అందజేశారు.

కేక్‌ల తయారీకి ఫ్రూట్ మిక్సింగ్

తగరపువలస: స్థానిక ఎంఎఫ్‌పీలో కేకుల తయారీకి వినియోగించే ఫ్రూట్ మిక్సింగ్‌ను శుక్రవారం తయారు చేశారు. క్రిస్మస్, న్యూ ఇయర్ వేడుకల్లో వినియోగించే కేక్‌ల తయారీ కోసం ఈ ఫ్రూట్ మిక్స్‌ను వినియోగించనున్నట్టు ఎంఎఫ్‌సీ అధినేతలు ఆదిమూలం నాగరాజు, సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో వెంపాడ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు వెంపాడ శ్రీనివాసరెడ్డి, ఎంఎఫ్‌సీ మేనేజర్ ఎ.నారాయణ, న్యాయవాది సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



ఫ్రూట్ మిక్సింగ్‌లో స్థానిక ప్రముఖులు

ఘనంగా ద్వాదశి పూజలు

కొమ్మాది: స్థానిక అన్నంరాజునగర్‌లో గల శ్రీ అష్టలక్ష్మీ దేవాలయంలో శుక్రవారం కార్తీక శుద్ధ ద్వాదశి సందర్భంగా శ్రీ లక్ష్మీనారాయణ స్వామికి విశేష పూజలు నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి శ్రీధరస్వామి తెలిపారు. ఈ సందర్భంగా ముందుగా పాలాభిషేకం చేసి క్షీర సాగరంలో స్వామి వారిని నిలిపి పూజలు చేశారు. సాలిగ్రామ ధానాలు, దీపదానాలు, స్వయంపాకాలు, గోదానాలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

